కఠిన చట్టాలు అవసరం



లైంగిక దాడులు, హత్యలకు పాల్పడే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. మహిళలు, వైద్యులు, వైద్యసిబ్బందిపై దాడులు అమానుషం. చట్టాలు కఠినంగా ఉండాలి. విధించే శిక్షల గురించి వింటేనే నేరస్తుల వెన్నులో వణుకుపుట్టాలి. నేరం చేయాలంటే.. భయపడే పరిస్థితి రావాలి. అప్పుడే మహిళలు ధైర్యంగా బయటకు వచ్చి ఉద్యోగాలు చేయగలుగుతారు.

– కె.వెంకట రమణ, స్టాఫ్ నర్స్, నగరం పీహెచ్‌సీ

నిందితులను శిక్షించాలి



కోల్‌కతాలో మెడికోపై జరిగిన హత్యాచారం ఘటన కలచివేసింది. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇందుకు కఠిన చట్టాలు అవసరం. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి. మహిళలకు రక్షణ కల్పించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

– డి.రజనీకుమారి, ఏఎన్‌ఎం, ఐలవరం, భట్టిప్రోలు మండలం

దేవతలకు ప్ర‘జల అభిషేకం’



కొల్లూరులో జలాభిషేకానికి బిందెలతో నీటిని తీసుకువెళ్తున్న భక్తులు

కొల్లూరు/రేపల్లె రూరల్ : వర్షాలు కురిసి పాడి పంటలు విలసిల్లాలని ఆకాంక్షిస్తూ గ్రామీణ ప్రజలు దేవతలకు ఆదివారం జలాభిషేకాలు జరిపించారు. కొల్లూరులో గ్రామస్తులు కాలువలు, నదీజలాలను బిందెలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి చింతలమ్మ, అంకమ్మలను అభిషేకించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు.



బూరుగులమ్మకు అభిషేకం చేస్తున్న భక్తులు

● రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



రేపల్లెలో పూజలందుకున్న బూరుగులమ్మ

వేకువజామునే భక్తులచే 108 బిందెలతో అమ్మవారి నామాన్ని జపిస్తూ జలాభిషేక మహోత్సవంను కన్నుల పండువగా చేశారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. 4వ వార్డులోని చినబూరుగులమ్మ ఆలయం వద్ద నుంచి భక్తులు అధిక సంఖ్యలో బూరుగులమ్మ ఆలయానికి ర్యాలీగా పసుపు, కుంకుమ, పండ్లు, నూతన వస్త్రాలు, గాజులు, పువ్వులు, మిఠాయిలతో కూడిన సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రావణమాస ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: శ్రావణమాసం పురస్కరించుకుని దేవతల గుడిగా ప్రసిద్ధిగాంచిన గంగాపార్వతి సమేత విఠలేశ్వరస్వామి (శివాలయం) దేవాలయంలో శుక్రవారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 21వ రోజు శ్రావణ మాస పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి బూర్లె అరుణ కుమారి, సభ్యులు మాటూరు గృహలక్ష్మి, టి.కన్యాకుమారి, టి.సుధారాణి, టి.శశి, బి.కన్యకాదేవి, ఎ.సునీత, సుగుణవతి, ఝాన్సీ, నాగసుధ, ఎం.ధనలక్ష్మి, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

అమ్మవార్లకు చద్దినైవేద్యాలు



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు



అమ్మవార్లకు చద్ది నైవేద్యాలు సమరించడానికి ఊరేగింపుగా వెళ్తున్న అర్చకులు, భక్తులు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు శ్రావణమాసం పురస్కరించుకుని ఆదివారం చద్ది నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు క్రోవి రామకృష్ణ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్ల మధ్య అమ్మవారి సన్నిధికి భక్తులు చేరుకుని పూజలు జరిపారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ పర్యవేక్షించింది.

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

● గంజాయి రహిత సబ్ డివిజనే లక్ష్యం
● విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు

బాపట్లటౌన్: ప్రత్యేక కార్యాచరణతో నేరాలను నియంత్రిస్తామని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గంజాయి నియంత్రణపై దృష్టి సారిస్తున్నామని, గంజాయి రహిత సబ్ డివిజనే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో విద్యా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, మహిళలను వేధించినా, వెంటపడినా, వారి పట్ల దురుసుగా ప్రవర్తించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలని, మైనర్లు వాహనాలు తోలుతూ ఏదైనా ప్రమాదాలకు కారకులైతే అందరిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంటుందని వివరించారు. చట్టాలను అతిక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాపట్లలో ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని, ప్రధాన రహదారులలో వాహనాలు నిలిపేవారికి అపరాధరుసుం విధిస్తామని పేర్కొన్నారు.



డీఎస్పీ రామాంజనేయులు

కర్లపాలెం ఎస్‌ఐగా రవీంద్ర

కర్లపాలెం: కర్లపాలెం ఎస్‌ఐగా ఎస్.రవీంద్ర ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన కాకుమాను ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రవీంద్ర మాట్లాడుతూ కర్లపాలెంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు, శాంతిభద్రతలను కాపాడేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

450 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు

భట్టిప్రోలు: మార్కండేయ పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘీయుల పిల్లలకు ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. 450 మంది పిల్లలకు ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో 500 మార్కులు పైబడి వచ్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నోట్‌పుస్తకాలు అందించిన దాతను అభినందించారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

తెనాలిరూరల్: సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో డిగ్రీ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కఠెవరం కట్టకు చెందిన 22 ఏళ్ళ కోట్ల గణేష్ ఇంటర్ చదివి దాల్ మిల్లులో డ్రైవర్‌గా పని చేశాడు. డిగ్రీ చదవుతానని తల్లిదండ్రులను అడగడంతో తెనాలిలోని డిగ్రీ కళాశాలలో చేర్పారు. సరిగా చదవకపోతుండడంతో గత నెల 27న తల్లిదండ్రులు మందలించారు. దీంతో అతను ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలోనూ వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఎన్ని రోజులు ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కేఎల్పీ స్కూల్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఈ నెల 22న జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో అండర్–14, 15, 16, 18 జిల్లాస్థాయిలో ఓపెన్ స్పోర్ట్స్ మీట్‌కు జిల్లా వ్యాప్తంగా 44 పాఠశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు పోటీపడ్డారని చెప్పారు. క్రీడా పోటీల్లో భాగంగా లాంగ్ జంప్, హై జంప్, జావలిన్ త్రో, 60 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకంతో పాటు షాట్‌పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో రజతం, 600 మీటర్ల పరుగులో కాంస్యం కైవసం చేసుకున్నట్లు వివరించారు.

టీచర్ల ‘ఆట’హాసం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



త్రోబాల్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయుడు

రేపల్లె రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలే కాకుండా ఉపాధ్యాయులను సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములను చేసేందుకు యూటీఎఫ్ కృషి చేయటం అభినందనీయమన్నారు. దీనిలో భాగంగా రేపల్లె పాత తాలూకా పరిధిలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాల్లోని ఉపాధ్యాయులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను సెప్టెంబర్ 1న బాపట్లలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, వాకింగ్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీ సుబ్రహ్మణ్యం, నాయకులు సాయిప్రసాద్, శ్రీనివాసరావు, రాజభూషణం, సుబ్బారావు, రవీంద్ర, లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే కేంద్రం లక్ష్యం

● ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి
● ఏడుగురు లబ్ధిదారులకు రూ.25 లక్షల చెక్కులు, రుణాల పంపిణీ

భట్టిప్రోలు: సుస్థిర జీవనోపాధులు, మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కేంద్రం ఫెసిలిటేషన్ ఆఫ్ లక్‌పతి దీదీ పథకం అమలు చేస్తున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చెప్పారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఎంపీపీ లలిత కుమారి మాట్లాడారు. తొలుత లక్‌పతి దీదీ పథకం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం ముగ్గురు లబ్దిదారులకు ముద్ర రుణాల చెక్కులు, నలుగురికి రుణ మంజూరు పత్రాలు అందించారు. మొత్తం రూ.25 లక్షల రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, స్త్రీ నిధి మేనేజర్ పి.అశోక్, ఎంఎస్‌ఏ బి.శిరీష, సీసీలు హనోకు, రజినీ, ఎంఎస్‌ఈసీ సభ్యులు, యానిమేటర్లు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో ముద్ర రుణ చెక్కు అందిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, చిత్రంలో జెడ్పీటీసీ ఉదయభాస్కరి

అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయడమే కేంద్రం లక్ష్యం

కర్లపాలెం: అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కర్లపాలెం మహిళా సమైక్య కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం లక్‌పతి దీదీ సంభావన లైవ్ ప్రోగ్రామ్‌ను డ్వాక్రా మహిళలు తిలకించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు ద్వారా తీసుకునే రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం కర్లపాలెం వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తూ రేపల్లెకు బదిలీపై వెళుతున్న పూర్ణచంద్రరావును ఏపీఎం శ్రీనివాసరెడ్డి, డ్వాక్రా మహిళలు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీ శివకోటేశ్వరరావు, వివోఏలు మార్తమ్మ, కుంచాల లక్ష్మి, మంజుల, శివపార్వతి, శాలినీ, నసీమా తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో సీసీ పూర్ణచంద్రరావును సన్మానించిన డ్వాక్రా మహిళలు



కొల్లూరులో డ్వాక్రా మహిళను సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు ఎదిగితే కుటుంబాలు సుభిక్షం

కొల్లూరు : మహిళల ఆర్థిక ఎదుగుదలతో వారి కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయని మదర్ థెరీసా మండల సమాఖ్య ఏపీఎం జి.రాము అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో లక్‌పతీ దీదీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ సందేశాన్ని డ్వాక్రా మహిళలు వర్చువల్‌గా వీక్షించారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో లక్షాధికారులుగా మారాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పథకానికి ఎంపికైన డ్వాక్రా మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, వెలుగు సిబ్బంది ప్రభాకర్, ప్రసాద్, ప్రసన్నకుమార్, మారుతి పాల్గొన్నారు.

సమాజంలో తగ్గిపోతున్న మానవత్వం

తెనాలి: సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఎంతగానో పురోగమిస్తున్న నేటి కాలంలో మనుషుల్లో మానవత్వం తగ్గిపోతుండటం శోచనీయమని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ విచారం వ్యక్తం చేశారు. మానవత్వం మనిషి తనానికి ప్రతీకగా చెబుతూ, సమాజం కోల్పోతున్న మంచినీ, మానవత్వాన్ని మేల్కొలపటానికి స్వచ్ఛంద సేవా సంస్థ మానవత చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మానవత సేవా కార్యక్రమాల్లో తనను కూడా భాగస్వామ్యం చేయాలని కోరారు. మానవత, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితుడు, అమృతసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామమోహనరావు మాట్లాడుతూ తెనాలి ప్రాంతం తమకు ఎంతగానో ఇచ్చిందని, తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ తెనాలి శాఖ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ప్రశంసనీయమని చెప్పారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను సత్కరించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం వెంకట ప్రసాద్ (ఓంకార్ ప్రసాద్), ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి పి.వెంకట్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కల్యాణి, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, వై.రోహిణి, ఎ.లక్ష్మి, మానవత సభ్యులు పాల్గొన్నారు.



కేవీ గోపాలకృష్ణకు సత్కారం

వృద్ధాప్యం ఎవరికీ శాపం కారాదు

తెనాలి: వృద్ధాప్యం ఒక శాపంలా కాకుండా వరంలా ఉండాలని ఇందుకు వృద్ధులకు మనోధైర్యంతో పాటు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉండాలని పావులూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గుడివాడ ఏఎన్నార్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ పావులూరి శ్రీనివాసరావు అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ‘వార్ధక్యంలో ఆనందం’ అనే అంశంపై శ్రీనివాసరావు మాట్లాడారు. వయోభారంతో మానసిక అశాంతికి గురికారాదని సూచించారు. వయసు కారణంగా వచ్చే అనారోగ్యాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, వ్యాధులు దరిచేరితే తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. అందరితో కలిసిమెలసి ఉండాలన్నారు. తన జీవితానుభావాలతో నేటి తరానికి తగిన మార్గదర్శనం చేయాలని కూడా చెప్పారు. ఆధ్యాత్మికతను అనుసరిస్తూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని చెప్పారు. మొవ్వా సత్యనారాయణ చేస్తున్న సమాజ సేవను అభినందిస్తూ తనవంతు ఆర్థిక సాయంతో సేవలను అందిస్తానని చెప్పారు.

సర్వజ్ఞ సింధుకు విద్యా అవార్డులు



తెనాలి: పట్టణానికి చెందిన దీవి సర్వజ్ఞ సింధు విజ్ఞాన్ యూనివర్శిటీలో బీటెక్ (బయోటెక్నాలజీ)లో ‘బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్–2024, చైర్మన్స్ గోల్డ్ మెడల్ అవార్డును స్వీకరించారు. విజ్ఞాన్ యూనివర్శిటీలో శనివారం జరిగిన 12వ స్నాతకోత్సవంలో ఈ అవార్డులను అందుకున్నారు. బయోటెక్నాలజీలో 9.66 గ్రేడ్ సాధించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కంపెనీల నుంచి మంచి ప్యాకేజీతో ఉద్యోగ ఆఫర్లను అందుకున్నారు. పట్టణ చినరావూరుకు చెందిన దీవి వేణుగోపాల్, అనంతలక్ష్మి (గోవాడ) దంపతుల కుమార్తె సర్వజ్ఞ సింధు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి బాధాకరం



నగరం: వైఎస్సార్ సీపీ కార్యకర్త దాసరి శంకర్ (32) మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. మండలంలోని పరిశావారి పాలెం గ్రామానికి చెందిన దాసరి శంకర్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గణేష్ ఆదివారం శంకర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. శంకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శంకర్ గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేసి ఉత్తమ వలంటీర్ అవార్డును పొందారు.

30న వాసవీ మాతకు శ్రావణమాస సారె



భట్టిప్రోలు: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాస సారె మహోత్సవం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా ఆదివారం తెలిపారు. దేవస్థానంలో ఆరు దశాబ్దాల క్రితం ప్రతిష్ఠించిన వాసవీ మాతకు సారె, మూల విరాట్‌కు 108 కొత్త చీరలతో అలంకారం చేయనున్నట్టు వెల్లడించారు. స్థానిక అమ్మవారి చెట్టు వద్ద నుంచి ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీలో 2019–2020 ఆర్థిక సంవత్సరంలో అవినీతి జరిగిందని పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఆదేశానుసారం డీఎల్‌పీఓ నరసింహారావు ఆదివారం విచారణ చేశారు. రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఈవోపీఆర్డీ టి.ఉషారాణికి అందజేశారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని వెల్లడించారు. నరసింహారావు వెంట పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ
వ్యక్తికి గాయాలు

బాపట్లటౌన్: ద్విచక్ర వాహనం, కారు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం జరిగింది. స్థానిక చిల్లరగొల్లపాలెం గ్రామానికి చెందిన దాది శ్రీనివాసరావు బాపట్ల నుంచి చిల్లరగొల్లపాలెం వెళ్తుండగా గుంటూరు వైపు నుంచి బాపట్లకు వస్తున్న కారు రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

సెలవు దినాల్లో తరగతులు సహించం



తెనాలి: ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ కోరారు. తెనాలి నియోజకవర్గ నాయకులతో కలిసి ఆదివారం పట్టణంలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు/ కార్పొరేట్ కళాశాలలకు వెళ్లి మూసివేయించారు. ర్యాంకుల పేరుతో ఎక్కువ సమయం క్లాసులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుని ఈ చర్యలను అరికట్టాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. పలుమార్లు ఎంఈవో, డీఈవోకు చెప్పినప్పటికీ ఫలితం ఉండటం లేదన్నారు. అధికారులు యాజమాన్యాలు వినడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ.. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే, తమ సంస్థ ఆధ్వర్యంలో కచ్చితంగా అడ్డుకుని తీరతామని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించి ముందుకు రావాలని కోరారు. పట్టణ కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షుడు భూమేష్, వివేక్, పండు, ఎర్మియా, సాయి, తేజ పాల్గొన్నారు.